
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 5 కర్ణాటక వార్తలు
బుధవారం 7 ఫిబ్రవరి 2024



నేటి నుంచి నగరంలో స్వదేశీ మేళా

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): స్వదేశీ జాగరణ్ మంచ్ కర్ణాటక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7నుంచి 11వరకు బెంగళూరులో స్వదేశీ మేళాను ఏర్పాటు చేస్తున్నారు. హిందూ సంస్కృతి సంప్రదాయాలకు అద్దం పట్టే, భారతీయ సనాతన సంప్రదాయాలను మేళవిస్తూ ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నామని మంచ్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. జయనగర్‌లోని చంద్రగుప్త మౌర్య మైదానంలో 7న సాయంత్రం ప్రదర్శన ప్రారంభమవుతుందన్నారు. ప్రదర్శన ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9వరకు కొనసాగుతుందని ప్రకటనలో తెలిపారు.

వేడెక్కిన రాజకీయం

● ఢిల్లీలో కాంగ్రెస్ - బెంగళూరులో బీజేపీ.. ● నేడు అధికార, ప్రతిపక్షాల ధర్నాలు



బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీ-జేడీఎస్ మధ్య ఆరోపణలు, ప్రత్యారోపణలు రోజురోజుకు తీవ్రరూపం దాలుస్తున్నాయి. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలకు కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం గ్రాంట్ల విడుదలలో అన్యాయం చేస్తోందన్న ప్రధాన ఆరోపణతో ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద బుధవారం ముఖ్యమంత్రి సిద్దరామయ్య సారథ్యంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ధర్నాకు ఉపక్రమిస్తున్నారు. ధర్నాలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ పలువురు మంత్రులతో కలసి మంగళవారం ఢిల్లీకి బయల్దేరారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కూడా వేర్వేరు విమానాల్లో బుధవారం ఉదయానికల్లా ఢిల్లీకి చేరుకుంటారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. బీజేపీయేతర పాలిత రాష్ట్రాల విషయంలో కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతోందని, అనివార్య పరిస్థితుల్లోనే పోరుబాట పట్టాల్సి వచ్చిందని ఢిల్లీకి బయల్దేరబోయేముందు ముఖ్యమంత్రి సిద్దరామయ్య మీడియాకు తెలిపారు. 2017 నుంచి ఇంతవరకు రాష్ట్రానికి పన్నులు, గ్రాంట్ల రూపంలో రూ.1.87 లక్షల కోట్లు రావాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలు బీజేపీకి అధికారం కట్టబెట్టలేదన్న అక్కసుతోనే నిధులు విడుదల చేయకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ అధికారంలో ఉన్న సమయంలోనూ ఇలాంటి అన్యాయం జరిగినా అప్పట్లో ప్రధాని మోదీకి భయపడి పార్టీ ఎంపీలెవ్వరూ నోరు మెదపలేదన్నారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు ఆత్మవంచన చేసుకుంటున్నారని విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ కోసం నిధులు అడగడం లేదని, రాష్ట్ర ప్రజల కోసం న్యాయబద్ధంగా రావాల్సిన పన్నులవాటాను కోరుతున్నామని స్పష్టం చేశారు. ఇది రాజకీయ గిమ్మిక్ కానే కాదన్నారు. 26 మంది రాష్ట్ర బీజేపీ ఎంపీలు చేయాల్సిన పనిని ఇప్పుడు తాము చేస్తున్నామని తెలిపారు. నిజానికి దీన్ని బీజేపీయే రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీ ధర్నా తర్వాత అయినా కేంద్రప్రభుత్వం కళ్లు తెరుస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

కాళ్లరిగేలా తిరిగాం : మంత్రులు

కరువు సాయం కోసం, జీఎస్టీ పన్నుల వాటా కోసం ఢిల్లీకి పలుమార్లు వెళ్లినా సంబంధిత మంత్రుల అపాయింట్‌మెంట్ దొరికేది కాదని రెవెన్యూశాఖ మంత్రి కృష్ణబైరేగౌడ, ప్రజాపనుల శాఖ మంత్రి సతీశ్‌జార్కిహొళి వాపోయారు. బెంగళూరులో వారు మీడియాతో మాట్లాడుతూ తమ ఢిల్లీ ధర్నాకు పోటీగా బీజేపీ కూడా నిరసన ప్రదర్శనలు చేస్తుండడం రాజకీయమేనని పేర్కొన్నారు. దీనివల్ల ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరుతోందో బీజేపీ నాయకులు ఆత్మపరిశీలన చేసుకోవాలని తెలిపారు. తాము ప్రజలకోసం ధర్నా చేస్తుంటే బీజేపీ ఓట్ల కోసం రాజకీయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు బీజేపీ ధర్నా

కేంద్రప్రభుత్వంపై ఆరోపణలు గుప్పిస్తూ ఢిల్లీ జంతర్ మంతర్‌లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీ నిరసన ఏర్పాటవుతుండగా అదే సమయంలో బెంగళూరులోని విధానసౌధ గాంధీ విగ్రహం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలోనూ మెగా నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్నారు. ఈ నిరసన ప్రదర్శనకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర అధ్యక్షత వహించనున్నారు. మాజీ ముఖ్యమంత్రులు యడియూరప్ప, సదానందగౌడ, జగదీశ్‌శెట్టర్, బసవరాజ్ బొమ్మైతోపాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొంటారని నగరంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి. రాజీవ్ మంగళవారం మీడియాకు తెలిపారు. కేంద్రంపై అభాండాలు వేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకే ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా తలపెట్టిందని ఆరోపించారు. ప్రజలకు వాస్తవాలు తెలియచేయాలన్న ఉద్దేశ్యంతోనే తాము బెంగళూరులో ధర్నా చేస్తున్నామని వివరించారు. శాసనసభ సమావేశాల్లోనూ ప్రభుత్వాన్ని నిలదీస్తామన్నారు. కేంద్రం నుంచి సాయం పొందుతూ తప్పుడు గణాంకాలతో ప్రజలను దారి తప్పించడం క్షమించరాని నేరమన్నారు. ధర్నాలో పాల్గొనాల్సిందిగా జేడీఎస్ నేతలను కూడా ఆహ్వానించామని పేర్కొన్నారు. కాంగ్రెస్ పలాయనవాద రాజకీయాలు చేస్తోందని విరుచుకుపడ్డారు. మొత్తానికి ఢిల్లీలో కాంగ్రెస్ ధర్నా, బెంగళూరులో బీజేపీ ధర్నాతో రాజకీయం మరింతగా వేడెక్కనుందనే చెప్పాలి.

నేటి ఢిల్లీ సత్యాగ్రహంలో పాల్గొనండి

● ఎంపీలకు సీఎం లేఖ



బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): గ్రాంట్లు, జీఎస్టీ పన్నుల వాటా, కరువు సాయం, నీటిపారుదల ప్రాజెక్టులకు అనుమతులు తదితర అంశాల్లో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందని వివరిస్తూ ముఖ్యమంత్రి సిద్దరామయ్య మంగళవారం స్వయంగా రాష్ట్ర ఎంపీలందరికీ లేఖలు రాశారు. లేఖల ప్రతులను మీడియాకు విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం జరపతలపెట్టిన సత్యాగ్రహంలో పాల్గొనాలని, రాష్ట్ర ప్రజలకు జరుగుతున్న అన్యాయంపై గళమెత్తాలని ఈ లేఖలో ఆయన విజ్ఞప్తి చేశారు. జేడీఎస్ జాతీయ అధ్యక్షుడు మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడతో పాటు బీజేపీ, జేడీఎస్‌లకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులందరికీ సీఎం లేఖలు రాశారు.



పేరుకుపోయిన ఫైళ్లు

● రాష్ట్రంలో 1.37 లక్షలు పెండింగ్
● క్లియరెన్స్‌లో జరుగుతున్న జాప్యంపై సీఎం ఆగ్రహం
● నెలాఖరులోగా 10 శాతం పూర్తిచేయాలని ఆదేశం

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సిద్దరామయ్య నిర్వహిస్తున్న ఆర్థిక, పాలనా సంస్కరణల శాఖ సహా వివిధ శాఖలలో 1.37 లక్షల ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. సీఎం సూచనతో ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి రజనీశ్ గోయెల్ ఈ సమాచారాన్ని అందజేశారు. 2023 నవంబరు 30నాటికి 1,55,759 ఫైళ్లు పెండింగ్‌లో ఉండగా డిసెంబరు, జనవరి నెలల్లో అదనంగా 35,036 ఫైళ్లను తెరిచినట్టు ఆయన సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ అవధిలో కేవలం 52,935 ఫైళ్లు మాత్రమే క్లియర్ చేయగలిగారు. ఇంతభారీగా ఫైళ్లు పెండింగ్‌లో ఉండడంపై ముఖ్యమంత్రి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. పెండింగ్ ఫైళ్లను సాధ్యమైనంత త్వరగా క్లియర్ చేయాలని ప్రభుత్వ ముఖ్యకార్యదర్శికి సీఎం ఆదేశించారు. అత్యధికంగా నగరాభివృద్ధిశాఖలో 16,155 ఫైళ్లు పెండింగ్‌లో ఉండగా రెవెన్యూశాఖలో 13,632 ఫైళ్లు, ప్రాథమిక, ఉన్నత విద్యాశాఖలో 9,990 ఫైళ్లు, డీపీఏఆర్‌లో 8,267 ఫైళ్లు, హోంశాఖలో 7,976 ఫైళ్లు, వాణిజ్య పరిశ్రమల శాఖలో 7,297 ఫైళ్లు, ప్రజాపనులశాఖలో 7,135 ఫైళ్లు పెండింగ్‌లో ఉన్నట్టు సీఎంకు అందించిన సమాచారంలో తెలిపారు. ప్రజాపనులు, అటవీ, ఆర్థిక, గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్, జలవనరులు, వైద్యవిద్య, ఆరోగ్యశాఖల్లో తలా 5వేలకుపైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు ఈ సమాచారంలో పొందుపరిచారు. ఇదే అంశంపై ఇటీవల జరిగిన మంత్రిమండలి సమావేశంలోనూ సీరియస్‌గా చర్చ జరిగినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. సాధ్యమైనంత త్వరగా పెండింగ్ ఫైళ్లు క్లియర్ చేసేలా చొరవ తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జ్ మంత్రులకు సీఎం ఆదేశాలు ఇచ్చినట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగా ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి మంగళవారం వీడియో సదస్సు ద్వారా వివిధ శాఖల ప్రధాన కార్యదర్శులను అప్రమత్తం చేశారు. ఈనెలాఖరులోగా కనీసం 10శాతం పెండింగ్ ఫైళ్లు క్లియర్ చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారని, ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వలదని సుత్తిమెత్తగా హెచ్చరించినట్టు తెలుస్తోంది. పెండింగ్ ఫైళ్ల విషయం వెలుగు చూస్తూనే బీజేపీ ఘాటుగా స్పందించింది. రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన ఇంకా గాడిన పడలేదనడానికి ఇంతకంటే నిదర్శనం అవసరం లేదని బీజేపీ వ్యాఖ్యానించింది. పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజీవ్ మీడియాతో మాట్లాడుతూ పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.



ఫ్రీడంపార్కులో చెరకు రైతుల నిరసన

పంట రుణాలు మాఫీ చేయండి

● రైతుల పోరుబాట

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పంట రుణాలను మాఫీ చేయాలంటూ రైతులు పోరుబాట పట్టారు. రాష్ట్ర చెరకు రైతుల సంఘం అధ్యక్షుడు కురుబూరు శాంతకుమార్ సారథ్యంలో 'బెంగళూరు చలో' కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో రైతులు తరలివచ్చారు. ఫ్రీడంపార్కులో మంగళవారం జరిగిన ధర్నాను ఉద్దేశించి కురుబూరు శాంతకుమార్ మాట్లాడుతూ 2024 రాష్ట్ర బడ్జెట్‌లో రైతాంగం సంక్షేమానికి పెద్దపీట వేయాలని డిమాండ్ చేశారు. ఎలాంటి షరతులు లేకుండా పంట రుణాలను మాఫీ చేయాలన్నారు. వర్షాభావంతో రైతుల పరిస్థితి చాలా దారుణంగా ఉందని, పంటలకు కనీస ధర లభించక రైతులు విలవిలలాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు రూ.25వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులు వినియోగించే కీటక రసాయనాలు, ఎరువులు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, ట్రాక్టర్ విడిభాగాలపై జీఎస్టీ రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రీన్‌బర్డ్స్ విభాగానికి చెందిన మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. రైతుల ర్యాలీ కారణంగా మెజస్టిక్, ఆనందరావ్ సర్కిల్, కేఆర్ సర్కిల్ ప్రదేశాల్లో ట్రాఫిక్ స్తంభించింది.

రేపటి నుంచి విజయనగర ఉత్సవాలు

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల ఆనెగొంది సంస్థానం ఆధ్వర్యంలో విజయనగర సామ్రాజ్యవైభవానికి అద్దం పట్టే ప్రత్యేక ఉత్సవాలు ఆనెగొందిలో ఈనెల 8 నుంచి 18 వరకు జరగనున్నాయి. ఉత్సవాల వివరాలను నిర్వాహకవర్గం తరపున జయశ్రీ నగరంలో మంగళవారం మీడియాకు వెల్లడించారు. 8న షిఫాలి వైద్య సారథ్యంలో ఆధునిక భారత ప్రదర్శన ఉంటుందన్నారు. 9న హంపికి చెందిన బృందంచే పురంధరదాస ఆరాధన మహోత్సవం, 11న ప్రొఫెసర్ వంశీ జూలూరుచే కిష్కింద రూపకం, 12న రఘోత్తమరావుచే విజయనగర సామ్రాజ్య వైభవ కార్యక్రమం, 13న డాక్టర్ కేజీ గోపాలకృష్ణచే ప్రత్యేక సాంస్కృతిక రూపకం ఉంటాయన్నారు. 14న విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చలమేశ్వర్ ప్రత్యేక ప్రసంగం ఉంటాయని వివరించారు. 15న తిరుమల వెంకట దేవరాయచే కార్యక్రమం, శారదా సావంత్‌లచే ప్రత్యేక కార్యక్రమాలు, 16న రవిలోచన అయ్యంగార్, డాక్టర్ చిత్రా మాధవన్, స్థపతి కేపీ ఉమాపతి ఆచార్యచే ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. శ్రీకృష్ణదేవరాయ పాలనలో శిల్పకళా సౌందర్యం, సంగీత సాహిత్య వైభవాల గురించి ఈ ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 18న ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమాలకు ఆహ్వానం మేరకే అనుమతి ఉంటుందన్నారు. చివరి రోజు ఆనెగొందిలోని గగన్ మహల్‌లో విజయనగర సామ్రాజ్య సాంస్కృతిక వైభవ రూపకం ప్రత్యేక ఆకర్షణ కానుందన్నారు.



పశువులతో వినూత్న నిరసన ఇలా...

పాడిరైతుల నిరసన

● మానవత్వం లేని ప్రభుత్వమిది: బీజేపీ
● విధాన సౌధ ముట్టడికి యత్నం

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు సబ్సిడీ విడుదలలో ప్రభుత్వం చేస్తున్న తాత్సారం సిగ్గుచేటు అని బీజేపీ వ్యాఖ్యానించింది. సబ్సిడీ విడుదలలో జరుగుతున్న జాప్యానికి నిరసనగా బెంగళూరు ఫ్రీడం పార్కులో బీజేపీ నగర విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం ప్రదర్శన నిర్వహించారు. ఆవులతో సహా విధానసౌధ ముట్టడికి ప్రయత్నించిన నేతలను పోలీసులు అరెస్టు చేశారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. రాజీవ్ ఫ్రీడంపార్కులో మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం గోవుల ఉనికికే చేటుతెచ్చే విధానాలను అమలు చేస్తోందని మండిపడ్డారు. పలు తాలూకాల్లో చోట్ల పశువుల ఆసుపత్రులు లేవన్నారు. యడియూరప్ప సీఎంగా ఉన్నప్పుడు రైతులకు ఇస్తున్న రూ.4వేల సబ్సిడీని ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. యంత్రధార పథకానికి సంబంధించి నిధులను, రైతుల విద్యాసిరి స్కాలర్‌షిప్‌లను అర్ధాంతరంగా ఆపేసిందన్నారు. ఇవి పాడి రైతు వ్యతిరేక విధానాలేనని ఆరోపించారు. రైతులకు వ్యవసాయశాఖ సబ్సిడీ యంత్రాలను ఇవ్వడం లేదని, కాంగ్రెస్ పగ్గాలు చేపట్టాక 850 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. గ్యారెంటీ పథకాలతో ప్రజాధనాన్ని వృథా చేస్తున్న ప్రభుత్వం, పాడిరైతులకు చెల్లించాల్సిన బకాయిల విడుదలలో నిర్లక్ష్యం సరికాదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రైతు మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు ఏఎస్ నడహళ్లి, బెంగళూరు ఉత్తర జిల్లా అధ్యక్షుడు ఎస్. హరీశ్, సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు సప్తగిరిగౌడ పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికలకు కమలనాథుల కసరత్తు



● 10న రాష్ట్రానికి బీజేపీ అగ్రనేతలు

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో బీజేపీ అగ్రనేతలు రాష్ట్రంపై ప్రత్యేక దృష్టి సారించారు. రాష్ట్రంలో 28 లోక్‌సభ స్థానాలు ఉండగా ప్రస్తుతం 25 మంది బీజేపీకి చెందినవారే ఉన్నారు. మండ్య ఇండిపెండెంట్ ఎమ్మెల్యే సుమలత బీజేపీకి మద్దతిస్తున్నారు. ఇదే తరహాలోనే వచ్చే ఎన్నికల్లోనూ అత్యధిక సీట్లు సాధించాలని భావిస్తున్న అధిష్ఠానం పెద్దలు ఈనెల 10న రాష్ట్రంలో పర్యటించనున్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షా, కేంద్రరక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాష్ట్రానికి వస్తున్నారు. ఈనెల 10, 11 వతేదీలలో వారు పర్యటించనున్నారు. అమిత్‌షా హుబ్బళ్లి, మైసూరులో పర్యటించే అవకాశం ఉంది. ప్రతి 8 లోక్‌సభ స్థానాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ప్రతి నియోజకవర్గం పరిధికి సంబంధించిన నేతలతో పాటు రాష్ట్ర నాయకుల అభిప్రాయాలు, ఎన్నికలకు ముందు వ్యూహాలపై చర్చించనున్నారు. రెండురోజుల వ్యవధిలో 28 స్థానాలకు సంబంధించి అమిత్‌షా, రాజ్‌నాథ్‌సింగ్ వేర్వేరుగా సమీక్షలు జరపనున్నారు. అభ్యర్థుల ఎంపికతో పాటు దాదాపు అన్ని విషయాల్లోను స్పష్టత తీసుకురానున్నారు. లోక్‌సభ ఎన్నికల్లో జేడీఎస్‌తో పొత్తు కుదిరింది. జేడీఎస్‌కు నాలుగు స్థానాలు కేటాయించే అవకాశం ఉన్నట్లు సమాచారం. మిగిలిన స్థానాల అభ్యర్థులను ఒక కొలిక్కి తీసుకురానున్నారు. పలువురు సీనియర్లు మరోసారి పోటీ చేసేది లేదని బహిరంగంగా ప్రకటించిన మేరకు వారి స్థానాలలో యువనేతలను బరిలోకి నిలిపే అవకాశం ఉంది. 11న మైసూరులో జరిగే సుత్తూరు జాతరలో అమిత్‌షా పాల్గొంటారు. ఇటీవల రాష్ట్రానికి చెందిన నాయకులు సోమణ్ణ, బసనగౌడ పాటిల్ యత్నాళ్ ఢిల్లీ నేతలను కలిసిన వేళ ఫిబ్రవరిలో రాష్ట్రానికి వస్తామని, అన్ని సమస్యలకు చర్చిస్తామని భరోసా ఇచ్చారు. రాష్ట్ర నేతలతో ప్రత్యేక కోర్‌కమిటీ సమావేశం కూడా ఏర్పాటు చేయనున్నారు. అమిత్‌షా వస్తుండటంతో ఎంపీ టికెట్ల విషయం ఒక కొలిక్కి రానుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆలయాలకు కొత్తశక్తి




● ఆరు నెలల్లోనే ఆదాయం రెట్టింపు ● శక్తిగ్యారెంటీతో పెరిగిన మహిళల రద్దీ

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శక్తి గ్యారెంటీ ప్రభావంతో పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకు కొత్త శక్తినిస్తోంది. రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాలలో రెట్టింపుకంటే ఆదాయం పెరిగింది. 2023 జూన్‌లో శక్తి గ్యారెంటీ పథకం ప్రారంభించారు. రాష్ట్రంలో పర్యటించే సాధారణ ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు ఉంది. నగరాలలో తిరిగే సిటీ బస్సులకు కూడా ఉచితం వర్తిస్తుంది. ఈ ప్రభావం రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాలకు ఆదాయం పెంచింది. కేవలం ఆరు నెలల వ్యవధిలోనే దాదాపు అన్ని ఆలయాలకు ఆదాయం పెరిగినట్టు లెక్కలు చెబుతున్నాయి. 2024 సంవత్సరంలో ఈ ఆదాయం మూడు నుంచి నాలుగు రెట్లు పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ప్రముఖ ఆలయాలలో ఆదాయం ఇలా ఉంది. వీటితోపాటు పలు ట్రస్టులు, మఠాల పర్యవేక్షణలోని ప్రముఖ ఆలయాలు ఉన్నాయి. వీటి ఆదాయం కూడా గణనీయంగా పెరిగినట్టు తెలుస్తోంది. ధర్మస్థళ మంజునాథేశ్వర, ఉడుపి శ్రీకృష్ణ మఠం, హొరనాడు అన్నపూర్ణేశ్వరి, గోకర్ణ ఆలయంతోపాటు ఉత్తర కన్నడ జిల్లాలోని పదులసంఖ్యలో మఠాలకు అనుబంధంగా ఉండే ఆలయాలలో కూడా ఆదాయం గణనీయంగా పెరిగింది.



బస్సుల వద్ద మహిళల రద్దీ ఇలా..

దేవాలయం	2022	2023 (కోట్లలో)
కుక్కె సుబ్రహ్మణ్య	74.17	123.64
కొల్లూరు మూకాంబిక	31.36	59.47
చాముండేశ్వరి	21.92	52.40
యడియూరు సిద్ధలింగేశ్వర	31.74	36.48
కటీల్ దుర్గా పరమేశ్వరి	19.57	32.10
నంజనగూడు	18.49	26.71
మందర్తి దుర్గా పరమేశ్వరి	9.77	14.55
ఘాటి సుబ్రహ్మణ్య	7.89	12.25
బెంగళూరు బనశంకరి	5.95	10.58



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1588.13	1,614.45
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	000	000
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	266	9,658
సామర్థ్యం (టీఎంసీలు)	9.54	47.13

ఉల్లి రైతు కంట ఆగని కన్నీరు!

- బెంగళూరు మార్కెట్లో క్వింటాల్ రూ.1200
- ఆందోళనలో రైతులు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 6: తల్లి చేయని మేలు ఉల్లి చేస్తుందంటారు. కాని రైతులకు మాత్రం ఆ ఉల్లి మేలుకు బదులుగా కీడు చేస్తోంది. మార్కెట్లో ఉల్లిధరలు పడిపోవడంతో ఉల్లిని సాగు చేసిన రైతు కంట కన్నీరు కారుతోంది. అక్టోబర్, నవంబర్‌లో కిలో ఉల్లిధర రూ.100 వరకు పెరిగింది. దీంతో పంటకు మంచి ధర వస్తుందనే ఆశతో రైతులు ఉల్లిని విరివిగా సాగు చేశారు. కానీ ఇంతలోనే ధరల నియంత్రణ కోసం కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై నిషేధం విధించడంతో ధరలు పడిపోయాయి. కొద్ది రోజుల క్రితం వరకూ వినియోగదారులకు కన్నీళ్లు తెప్పించిన ఉల్లి ఇప్పుడు సాగుదారులకు కన్నీళ్లు తెప్పిస్తోంది. తాలూకాలోని ఇట్టిగి ఉత్తంగి, తలకల్లు, కల్లహళ్ళిసోగి తదితర గ్రామాల్లో 150 హెక్టార్లలో ఉల్లిసాగు చేశారు. ప్రస్తుతం పంట కోతకు వచ్చింది. క్వింటాల్‌కు రూ.2000 పైన ఉన్న ధర ఇప్పుడు బెంగళూరు మార్కెట్లో రూ.1200కు పడిపోయింది. గత ఐదు ఏళ్లుగా ఉల్లికి ఆకుమచ్చ తెగులు సోకగా, రుతుపవనాల ప్రభావం వల్ల పంట నష్టంతో రైతులు చేతులు కాల్చుకున్నారు. ఈ సంవత్సరం పంట బాగా పండినా గిట్టుబాటు ధర లేక రైతులు నష్టపోతున్నారు.

ఉత్తంగికి చెందిన రైతు వీరయ్య మాట్లాడుతూ, ఒకటిన్నర ఎకరాల్లో ఉల్లిని విత్తడానికి, పంటను కాపాడుకోవడానికి రూ. 80,000 ఖర్చు అయిందని, ప్రస్తుతం ఉల్లి కోతకు వచ్చి 150 బస్తాల దిగుబడి వచ్చే అవకాశం ఉందన్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకడంతో పంట నిర్వహణకు పెట్టిన ఖర్చు తిరిగి వస్తుందన్న నమ్మకం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. క్వింటాల్ ఉల్లిని పండించడానికి రూ.1800 నుండి రూ.2000వరకు ఖర్చు అవుతుంది. ప్రస్తుతం ధర పతనం కావడంతో ఉల్లి సాగు చేసిన రైతులు నష్టపోయారు. రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ఉల్లి రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దేశ్ డిమాండ్ చేశారు.



కోతకు సిద్ధమైన ఉల్లి పంట



మార్కెట్‌కు పంపడానికి సిద్ధమైన ఉల్లిపాయలు

సిరుగుప్ప తహసీల్దార్‌గా షంషాలం



షంషాలం(ఫైల్)

సిరుగుప్ప, ఫిబ్రవరి 06 : సిరుగుప్ప తాలుకా నూతన తహసీల్దార్‌గా షంషాలం అధికార బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గతంలో వున్న తహసీల్దార్‌ను బళ్లారికి బదిలీ చేశారు. ఆ స్థానంలో లింగసూగూరు తాలుకాలో తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న షంషాలంను సిరుగుప్పకు బదిలీ చేయడంతో ఆయన మంగళవారం అధికార బాధ్యతలు చేపట్టారు.

రాజ్యాంగంపై జనజాగృతి ర్యాలీ



ర్యాలీకి శ్రీకారం చుట్టిన సంక్షేమ శాఖ డైరెక్టర్ రాజేశ్వరి

సిరుగుప్ప, ఫిబ్రవరి 06 : రాజ్యాంగలోని అంశాలను ప్రజలకు తెలియజేయాలనే ఉద్దేశంతో సిరుగుప్ప పట్టణంలో మంగళవారం జనజాగృతిర్యాలీ జరిగింది. హైస్కూలు గ్రౌండ్‌లో ఈ కార్యక్రమానికి తాలుకా సాంఘీక సంక్షేమశాఖ డైరెక్టర్ రాజేశ్వరి శ్రీకారం చుట్టారు. ప్రధానంగా అంబేద్కర్ ఆశయాలు, సిద్ధాంతాలు, రాజ్యాంగంలో పేర్కొన్న చట్టాలను ప్రజలకు తెలియజేయాలన్నదే ర్యాలీ ముఖ్యోద్ధేయమని తెలిపారు. ఈ సందర్భంగా తాలుకాకు చెందిన ప్రముఖ రాజకీయపార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

మా సమస్యలను పరిష్కరించాలి

విభిన్న ప్రతిభావంతుల మొర



తహసీల్దార్‌కు వినతి ప్రతం అందిస్తున్న దృశ్యం

గంగావతి రూరల్, ఫిబ్రవరి 6: తమ సమస్యలను పరిష్కరించాలంటూ విభిన్న ప్రతిభావంతుల తాలూకా అధ్యక్షుడు అశోక్ గుడికోట అన్నారు. గంగావతి శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లో మంగళవారం నిరసన తెలిపిన అనంతరం తహసిల్దార్ కార్యాలయానికి చేరుకుని తాహసిల్దార్ మంజునాథ్‌కు ఈ మేరకు వినతి పత్రం అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వికలాంగులకు రూ. 5వేలు నెలవారీ పింఛన్, వారికి నివాసస్థలాలను కేటాయించాలన్నారు. అంతేకాక వారికి ఉచిత బస్సు సౌలభ్యం కలిపించాలన్నారు. ఈసందర్భంగా జిల్లాధ్యక్షుడు పంపనాయక్, భువనేశ్వరీ, అనుసూయ, వీరేశ్, మంజునాథ్, అబ్రహం, ఖాసీంవలి, సైయ్యద్‌భాష, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ తాలుకా అధ్యక్షుడిగా రామయ్య

కంప్లి, ఫిబ్రవరి 06 : కేపీసీసీ బ్లాక్ కాంగ్రెస్ విభాగం తాలుకా అధ్యక్షులుగా ఆర్‌ఎం రామయ్య నియమితులయ్యారు. ఆయనను ఎమ్మెల్యే జేఎన్ గణేష్, బళ్లారి జిల్లా గ్రామీణ విభాగం కాంగ్రెస్ పరిశిష్ట జాతి విభాగం జిల్లా అధ్యక్షులు వీరాంజనేయులు అభినందించారు. అనంతరం రామయ్య మాట్లాడుతూ, కంప్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులుగా కాంగ్రెస్ పార్టీ గెలుపుకు, అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. అనంతరం వీరిని పలువురు అభినందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు వైజాగ్ రామ్ రాథోడ్, జిల్లా అధ్యక్షులు వీరాంజనేయులు, బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివాసరావు, బట్టప్రసాద్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



రామయ్యకు నియామక పత్రం అందిస్తున్న ఎమ్మెల్యే

కాంగ్రెస్ బూటకపు హామీలపై విస్తృతంగా ప్రచారం

శాసన మండలి ప్రతిపక్ష నేత రవికుమార్ సూచన



బళ్లారి బీజేపీ కార్యాలయంలో సమావేశాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

బళ్లారి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): వచ్చే ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అసత్య వాగ్దానాల గురించి ప్రజలకు వివరించాలని శాసనమండలి ప్రతిపక్ష నేత ఎన్. రవికుమార్ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో రానున్న ఎన్నికలపై కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బీజేపీ నుంచి ఎవరు పోటీ చేసినా వ్యక్తి గెలుపు కాకుండా పార్టీ గెలుపు కోసం అందరూ శ్రమించాలని, అప్పుడే దేశ ప్రధానిగా మూడో సారి నరేంద్రమోదీ ఎన్నికవుతారన్నారు. ముఖ్యంగా దేశ ప్రధాని నరేంద్రమోదీ అమలుచేస్తున్న పథకాలు ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసవరాజు, కార్యదర్శి శరణు తూచికేరి, చంద్రశేఖర్ పాటిల్, విరుపాక్షప్ప, బళ్లారి మాజీ ఎమ్మెల్యే సోమశేఖర్‌రెడ్డి, శిరశంకర్‌రెడ్డి, గోనల్ మురాహరిగౌడ, గురులింగణగౌడ, విరుపాక్ష గౌడ, హెచ్. హనుమంతప్ప, శివకృష్ణ, ఇబ్రహీం బాబు, డాక్టర్, మహిపాల్, మారుతీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

నాగప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు



ఏళుపడగల నాగప్పకు పూజలు నిర్వహించిన దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 06 : బుక్కసాగర వద్ద తుంగభద్ర నది ఒడ్డున అడవుల్లో వెలసిన ఏళుపడగల నాగప్ప దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజలు చేపట్టారు. ప్రతి మంగళవారం షష్టి, అమావాస్య, పౌర్ణమి రోజులలో ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగనున్నాయని ఆలయ కమిటీ సభ్యులు విశ్వనాథ్ తెలిపారు. సుబ్రహ్మణ్యస్వామి దర్శనానికి వెళ్లలేని వారు ఈ ఏళుపడగల నాగప్ప దేవాలయాన్ని సందర్శించి నాగ దోష నివారణ, ఇతర దోషాల నివారణకు ప్రత్యేక పూజలు చేపట్టి స్వామివారికి మొక్కులు సమర్పించుకుంటారని తెలిపారు. స్వామి వారికి ఉదయం జలాభిషేకం, అమృతాభిషేకం, పుష్పాభిషేకం, వివిధ ప్రత్యేక పూజలు జరిగాయన్నారు. అనంతరం స్వామివారికి పుష్పాలతో ప్రత్యేకాలంకరణ జరిపామని తెలిపారు. భక్తులు పూలు, పండ్లతో స్వామి వారికి, పాలతో ప్రత్యేక మొక్కులు సమర్పించారు.

పాల ఉత్పత్తిదారులను ప్రభుత్వం ఆదుకోవాలి : బీజేపీ రైతు మోర్చా

బళ్లారి, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): పాల ఉత్పత్తిదారులను ప్రోత్సహకాలు ఇచ్చి ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం అయిందని బీజేపీ రైతు మోర్చా నిరసన వ్యక్తం చేసింది. బళ్లారి గడిగిచెన్నప్ప సర్కిల్(రాయల్ సర్కిల్) నుంచి బీజేపీ జిల్లా రైతు మోర్చా జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ నేతృత్వంలో బీజేపీ కార్యకర్తలు మంగళవారం గోవులను తోలుకుని డి.సీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. బీజేపీ ప్రభుత్వంలో 26 లక్షల మంది గ్రామీణ రైతుల నుంచి రోజూ 80 లక్ష లీటర్ల పాలు సేకరించేవారన్నారు. అంతే కాకుండా రైతులకు మద్దతు ధర ఇచ్చారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని నిరసన వ్యక్తం చేశారు. రైతులను ఆదుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకాష్ గౌడు, మురహరి గౌడ, ఎమ్మెల్సీ సతీష్‌బాబు, మహిళ మోర్చ జిల్లా అధ్యక్షురాలు సుమ, రామలింగప్ప, తదితరులు పాల్గొన్నారు.



బళ్లారి డి.సీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ నాయకులు

కామర్స్ విద్యార్థులకు విస్తృత ఉద్యోగావకాశాలు

బళ్లారి సిటీ, ఫిబ్రవరి 6: ప్రస్తుతం వాణిజ్య శాస్త్రం చదువుతున్న విద్యార్థులకు వివిధ రంగాల్లో ఉద్యోగవకాశాలు పుష్కలంగా ఉన్నాయని విజయనగరంలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కులపతి డాక్టర్ రమేశ్ ఓలేకర్ అన్నారు. నగరంలోని బీడీఏఏ హాల్లో సరళాదేవి కళాశాల కామర్స్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగం, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్‌అకౌంట్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు సబ్జెక్టు సులువుగాఅర్థమయ్యేలా ఉపాధ్యాయులు బోధించాలని తెలిపారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్రాంత ప్రిన్సిపాల్ ఆర్ .మరేగౌడ సృజనాత్మకతను అలవర్చుకుని నూతన అవిష్కరణలను వినియోగించి సమర్థవంతంగా బోధించాలన్నారు. తద్వారా విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మంజునాథ్‌రెడ్డి అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా వాణిజ్య శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ ప్రహ్లదచౌదరి, మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ పల్లవి, ఆచార్యులు డాక్టర్ కన్యాకుమారి, బసవ, గురుబసప్ప పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ కులపతి

ప్రశాంతంగా ముష్టూరు పంచాయతీ అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నికలు



అధ్యక్ష, ఉపాధ్యక్షులను అభినందిస్తున్న దృశ్యం

కంప్లి, ఫిబ్రవరి 06 : కారటగి తాలుకా పరిధిలోని ముష్టూరు గ్రామ పంచాయతీ రెండవ విడత ఎన్నికలు మంగళవారం ప్రశాంతంగా జరిగాయి. 13 మంది గ్రామ పంచాయతీ సభ్యులు వుండగా అధ్యక్ష స్థానానికి బి సురేష్, ఉపాధ్యక్ష స్థానానికి లింగమ్మ, కావ్య మహేష్‌లు నామినేషన్లు వేశారు. అధ్యక్షస్థానానికి ఎవరూ పోటీ లేనందున సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్ష స్థానానికి మాత్రం లింగమ్మకు ఎనిమిది ఓట్లు, కావ్య మహేష్‌కు మూడు ఓట్లు పోలయ్యాయి. రెండు ఓట్లు ఇన్‌వాలిడ్ అయ్యాయి. దీంతో ఐదు ఓట్లతో లింగమ్మ ఉపాధ్యక్ష స్థానం కైవసం చేసుకుందని ఎన్నికల అధికారి తెలిపారు. గెలుపొందిన బీ సురేష్‌ను లింగమ్మను గ్రామ పంచాయతీ ప్రముఖులు అభినందించి సన్మానించారు. ఇకపై ముష్టూరు గ్రామపంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని సురేష్ తెలిపారు.

గగన విహారంపై హంపి పర్యాటకులకు తగ్గని మోజు

రేపటి వరకు బైస్కై, దృశ్యశ్రవణ ప్రదర్శనల పొడిగింపు



గజశాల వద్ద శ్రీకృష్ణ దేవరాయల దృశ్య, శ్రవణ ప్రదర్శనలో ఓ భాగం

కంప్లి, ఫిబ్రవరి 06 : హంపీ ఉత్సవాలు ముగిసినప్పటికీ పర్యాటకులకు గగనవిహారంపై మోజు ఏమాత్రం తగ్గినట్లు లేదు. హెలికాప్టర్ ద్వారా బైస్కై కార్యక్రమానికి ఏ మాత్రం డిమాండ్ తగ్గలేదు. రోజువారీ జీవితంతో విసిగిపోయిన జనం కొంత ఆటవిడుపు కావాలని కోరుకుంటున్నారు. దీంతో బైస్కై విహారానికి బారులు తీరుతున్నారు. హంపీ ఉత్సవాల సందర్భంగా కమలాపురం భువనేశ్వరి మయూరి హోటల్ ఆవరణలో హెలికాప్టర్ బైస్కైను ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఈ విహారానికి ఏర్పడిన డిమాండ్‌ను అధికారులు గమనించారు. దీంతో ప్రభుత్వానికి వచ్చే నష్టం ఏమీ పెద్దగా లేదు. పైగా కొంత ఆదాయం వచ్చే అవకాశం కూడా ఉంది. ఈ నేపథ్యంలో ప్రజల కోరిక మేరకు అదనంగా మరో మూడు రోజుల పాటు దీనిని పొడిగించారు. అలాగే గజశాల వద్ద దృశ్య శ్రవణ ప్రదర్శన కార్యక్రమాన్ని కూడా పొడిగించినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రదర్శన ద్వారా శ్రీకృష్ణదేవరాయల పరిపాలన కాలం నాటి చారిత్రక అంశాలను తిలకించవచ్చని అధికారులు అంటున్నారు. వాస్తవానికి ఇలాంటి ప్రదర్శనలు చంద్రగిరి లాంటి చోట్ల శాశ్వత ప్రాతిపదికన ఏర్పాటై ఉన్నాయన ప్రజలకు చారిత్రక అవగాహన కల్పించే ఇటువంటి ప్రదర్శన ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అధికారులు అంటున్నారు. ఈ ప్రదర్శన రాత్రి ఏడు గంటల నుంచి తొమ్మిది గంటలవరకు ఉంటుందని, ఇది పూర్తిగా ఉచితమని పేర్కొన్నారు. మరో మూడు రోజుల పాటు ఈ అవకాశం ఉంటుందని తెలిపారు.



భువనేశ్వరి ఆలయం వద్ద హెలికాప్టర్‌ను వీక్షిస్తున్న ప్రజలు

హాస్టల్‌ను పరిశీలించిన శాసనమండలి నేత

బళ్లారి సిటీ,ఫిబ్రవరి 6: శాసనమండలి ప్రతిపక్ష చీఫ్ విప్ రవికుమార్ బళ్లారి పర్యటన సందర్భంగా మంగళవారం నగరంలోని వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ పోస్టుమెట్రిక్ బాలికల వసతిగృహాన్ని సందర్శించి పరిశీలించారు. హాస్టల్లోని కిచన్‌గది, స్టోర్ గదిని పరిశీలించి మాట్లాడారు. హాస్టల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. పిల్లలకు నాణ్యమైన ఆహారం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. ఈసందర్భంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హోసూరు జోన్

శానమావు అడవుల్లో మళ్లీ ఏనుగుల మకాం



అడవుల్లో సంచరిస్తున్న ఏనుగుల మంద

హోసూరు, ఫిబ్రవరి 6: హోసూరు శానమావు అటవీ ప్రాంతంల్లో ఉన్న 15 ఏనుగులను ఇటీవల డెంకణీకోట అటవీ ప్రాంతానికి తరిమారు. అయితే 3 ఏనుగులు తిరిగి వచ్చి ఇక్కడే మకాం వేశాయి. దీంతో వాటిని మరలా డెంకణీకోట అటవీ ప్రాంతానికి తరమడానికి అటవీశాఖ అధికారులు చర్యలు చేపట్టారు. సరిహద్దులోని కర్ణాటక రాష్ట్ర కావేరీ వన్యప్రాణిధామ నుంచి గత అక్టోబర్ నుంచి వందకు పైగా ఏనుగులు అడవులను వీడి గ్రామాలవైపు తిరుగుతూ పంటలను తింటూ ధ్వంసం చేస్తూ జవలగిరి అడవుల్లోకి వచ్చాయి. ఈ క్రమంల్లో 13 ఏనుగులు ఊడేదుర్గం అడవుల్లోకి వెళ్లి అటవీ ప్రాంతంలో ఆశ్రయం పొంది సమీపంలోని పంటలను నాశనం చేస్తూ, హోసూరు సమీపాన సినిగిరిపల్లి, బెణెకల్ మీదుగా హోసూరు శానమావు అడవుల్లోకి వచ్చాయి. ఇలా ఈ అడవుల్లో ఇప్పటికే ఉన్న ఏనుగుల సంఖ్య 15కు చేరింది. ఏనుగులు గ్రామాల్లోకి రాకుండా దట్టమైన అడవుల్లోకి పంపేందుకు అధికారులు కార్యాచరణ చేపట్టారు.


ధర తగ్గిన కొత్తిమీర

హోసూరు(సిప్‌కాట్), ఫిబ్రవరి 6: కృష్ణగిరి జిల్లా హోసూరు ప్రాంతం కూరగాయలు, పూల సాగుకు ఎంతో ప్రసిద్ధి. ఇటీవల కొన్ని రోజులుగా పంటలకు తగిన ధర లేకపోవడంతో రైతులు నష్టం చవిచూస్తున్నారు. పుదీనా, కొత్తిమీర, పాలకూర వంటి వాటికి కూడా కనీస ధర లభించడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం కొత్తిమీర కట్ట రూ.1 లేదా 2 పలుకుతోందని, కనీసం కోత ఖర్చులు కూడా రావడం లేదంటున్నారు. దీంతో పండించిన పంటలను మార్కెట్‌కు తరలించకుండా పొలాల్లోనే వదిలేస్తున్నారు. హోసూరు సమీపంలోని ఎలువపల్లి గ్రామానికి చెందిన సిద్దప్ప తనకున్న ఎకరన్నర పొలంలో సుమారు రూ.60 వేల రూపాయలు వరకు వస్తుందని అంచనా వేసి కొత్తిమీర సాగు చేశాడు. అయితే ఇప్పుడు ధరలు పడిపోవడంతో కొత్తిమీరను ఆవులు మేసేందుకు వదిలేశాడు. ఇలా ఎంతోమంది రైతులు తమ బాధను వెలిబుచ్చారు.

నేడు త్యాగరాజస్వామి జయంతి ఉత్సవం

హోసూరు, ఫిబ్రవరి 6: హోసూరు నగరంలోని ఆంధ్ర సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో బుధవారం త్యాగరాజస్వామి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక సంగీత విభావరి నిర్వహించనున్నారు. సాయంత్రం 6 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందని సమితి అధ్యక్షులు రామచంద్ర తెలిపారు. భక్తి, సంగీత, సాహిత్యం త్రివేణి సంగమమైన త్యాగయ్య కృతులను స్థానిక సంగీత కళాకారులు ఆలపిస్తారన్నారు. సంగీత ప్రియులు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు రాయచూరుకు శాసనసభ స్పీకర్ రాక



స్పీకర్ యూటీ ఖాదర్(ఫైల్)

రాయచూరు, ఫిబ్రవరి 6 : శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ బుధవారం జిల్లా పర్యటనకు రానున్నారు. బుధవారం ఉదయం 8 గంటలకు రాయచూరుకు చేరుకునే స్పీకర్ అతిథి గృహంలో విశ్రాంతి అనంతరం యరమరస్ వద్ద జరిగే అధికారిక కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం దేవదుర్గ తాలూకా అరకేరా గ్రామంలో జరిగే కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం 3 గంటల తర్వాత జిల్లా నుంచి బయలుదేరి కొప్పళ జిల్లా గంగావతికి వెళతారు.

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

రాయచూరు, ఫిబ్రవరి 6 : అన్నభాగ్య పథకం ద్వారా పేదలకు అందాల్సిన రేషన్‌బియ్యం పక్కదారి పట్టాయి. రేషన్ దుకాణాల నుంచి జిల్లాలోని సిరవార తాలూకా చీకలపర్వి రోడ్డులోని వెంకటసాయి రైస్‌మిల్‌కు బియ్యం చేరినట్లు పక్కా సమాచారం అందుకున్న పౌరసరఫర శాఖ అధికారులు పోలీసులతో కలిపి ఆకస్మికదాడి చేశారు. దీంతో మిల్లులో 31 క్వింటాళ్ల బియ్యం పట్టుబడ్డాయి. ఆహార శాఖ అధికారి దేవరాజు, మాన్వి సబ్ ఇన్‌స్పెక్టర్ వీరేంద్ర హిరేమఠల నేతృత్వంలో దాడి జరిపారు. బియ్యాన్ని పౌరసరఫరాలశాఖ సబ్ డైరక్టర్ పరిశీలించి వాటిని రేషన్ బియ్యంగా ధ్రువీకరించారు. ఇందుకు సంబంధించి సిరవార పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉచిత వైద్య శిబిరం ప్రారంభం




వృద్ధుల ఆరోగ్యం గురించి తెలుసుకుంటున్న నేతలు

బళ్లారిరూరల్, ఫిబ్రవరి 06 : బళ్లారి తాలుకాలోని రూపనగుడి గ్రామంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని మంత్రి సోదరుడు వెంకటేష్ ప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వృద్దులకు పేద బడుగు బలహీన వర్గాలకు చెందిన నిరుపేదలకు ఉచిత వైద్య కేంద్రాలు ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు అనుకూలంగా వుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రముఖులు రూపనగుడి జయన్న, గోవర్ధన్ రెడ్డి, రాయాపురం, మర్రిస్వామి, గంగప్ప, గాదిలింగన్న గౌడతో పాటు కాంగ్రెస్ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు


పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కాంప్...

చార్లెస్ డికెన్స్ (జయంతి)



ప్రముఖ ఆంగ్ల నవలా రచయిత చార్లెస్ డికెన్స్ 1812 ఫిబ్రవరి 7న ఇంగ్లండ్ దేశం హ్యాంప్‌షైర్‌లోని ల్యాండ్‌పోర్ట్‌లో జన్మించారు. సామాజిక కార్యకర్తగాను రాణించారు. విక్టోరియన్ సామ్రాజ్యం ఉచ్ఛస్థితిలో ఉన్నప్పుడు, పారిశ్రామిక విప్లవం అభివృద్ధి చెందుతున్న రోజుల్లో ఈయన మొదటితరం రచయిత. ఆసక్తికరమైన కథనంతో గుర్తుండిపోయే పాత్రలతోనూ ప్రపంచవ్యాప్తంగా జీవితకాలంలో మంచి అభిమానులను సంపాదించుకున్నారు. నేటికీ ఆయన నవలలు ఆదరణ ఉన్నాయి. 1870 జూన్ 9న కన్నుమూశారు.

వేటూరి ప్రభాకర శాస్త్రి (జయంతి)



వేటూరి ప్రభాకర శాస్త్రి 1888 ఫిబ్రవరి 7న కృష్ణా జిల్లా మోపిదేవి మండలం పెద్దకళ్లేపల్లిలో జన్మించారు. తెలుగు కవి, భాషా పరిశోధకుడు, చరిత్రకారుడు, రచయిత, విమర్శకుడు, రేడియో నాటక రచయిత, తెలుగు, సంస్కృత పండితుడు ఇలా పలు రంగాలలో రాణించిన బహుముఖ ప్రజ్ఞాశాలి. విమర్శనా వ్యాస రచనకు ఆద్యుడిగా పేరొందారు. చరిత్రలో లభ్యమవుతున్న మొట్టమొదటి తెలుగు పదము 'నాగబు' అని కనుగొన్నది ఆయనే. తంజావూరు ఆంధ్ర రాజుల చరిత్ర, శ్రీనాథ వైభవము, శ్రీనగర శ్రీనాథం, మను చరిత్ర, బసవ పురాణం వంటి వాటి గురించి సమగ్ర వివరాలతో ప్రచురించారు. 1950 ఆగస్టు 29న కన్నుమూశారు. తిరుపతిలో ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేశారు. కాగా తిరుమల తిరుపతి దేవస్థానం స్వయంగా 2007లో శ్రీమన్ వేటూరి ప్రభాకరశాస్త్రి వాఙ్మయ పీఠం ఏర్పాటు చేసి ఆయన రచనలు, పరిశోధనలను ప్రచురించింది.

జీఎస్ శివరుద్రప్ప (జయంతి)



ప్రముఖ కన్నడ కవి గుగ్గరి శాంతవీరప్ప శివరుద్రప్ప 1926 ఫిబ్రవరి 7న శివమొగ్గ జిల్లా శికారిపుర తాలూకా ఈసూరు గ్రామంలో జన్మించారు. జీఎస్ఎస్‌గా సుపరిచితులైన ఆయన కవి, విమర్శకులు, పరిశోధకులు, నాటకకర్త, ప్రాధ్యాపకులుగా రాణించారు. కువెంపు తర్వాత 'రాష్ట్రకవి' గౌరవం అందుకున్న ఘనత ఆయనది. సమన్వయ కవిగా పేరొందారు. సౌందర్య సమీక్ష రచనకు పీహెచ్‌డీ పొందారు. కేంద్ర సాహిత్య అకాడమీ, పంప, మాస్తి పురస్కారం, గౌరవ డాక్టరేట్ ఇతర పురస్కారాలు పొందారు. 2013 డిసెంబరు 23న కన్నుమూశారు.

దొడ్డరంగేగౌడ (పుట్టినరోజు)



'పద్మశ్రీ' గ్రహీత దొడ్డరంగేగౌడ 1946 ఫిబ్రవరి 7న తుమకూరు జిల్లా మధుగిరి తాలూకా కురుబరహళ్లిలో జన్మించారు. కన్నడ ప్రొఫెసర్‌గా రిటైరైనా కన్నడ సినీ రంగంలో పేరొందిన గేయ రచయిత, కవిగా రాణించి తనదైన గుర్తింపు పొందారు. 500కు పైగా పాటలు రాశారు. 10కిపైగా సినిమాలు, 80కు పైగా టీవీ సీరియల్స్‌కు మాటలు రాశారు. మనుజకలం పేరిట 80కుపైగా కృతులు రచించారు. కన్నడ ప్రగాథగళ సామ్రాట్‌గా పేరొందారు. 2008 నుంచి 2014వరకు ఎమ్మెల్సీగాను వ్యవహరించారు. మూడుసార్లు ఉత్తమ గేయ రచయిత పురస్కారం, కర్ణాటక సాహిత్య అకాడమీ పురస్కారం అందుకున్నారు. 2021లో హావేరిలో 86వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనానికి అధ్యక్షత వహించారు.

కిదాంబి శ్రీకాంత్ (పుట్టినరోజు)



కిదాంబి శ్రీకాంత్ 1993 ఫిబ్రవరి 7న గుంటూరులో జన్మించారు. బ్యాడ్మింటన్ క్రీడాకారుడు. గోపీచంద్ బ్యాడ్మింటన్ అకాడమీలో శిక్షణ పొందారు. అంతర్జాతీయ స్థాయిలో అత్యధిక ర్యాంకు కల్గిన భారత పురుషుల ఆటగాడు. శ్రీకాంత్ గోస్పోర్ట్స్ ఫౌండేషన్ బెంగళూరు ద్వారా 2012 నుంచి స్కాలర్‌షిప్ ద్వారా తోడ్పాటు పొందుతున్నాడు. 2014లో సూపర్ డాన్‌గా పిలవబడే లిన్‌డాన్‌ను ఓడించి చైనా ఓపెన్ సూపర్ సిరీస్ ప్రీమియర్‌లో స్వర్ణపతకం సాధించి సత్తా చాటుకున్నాడు. ఇతర పోటీలలో రజత, కాంస్యం అందుకున్నారు. 2022లో ఆయన జట్టు థామస్‌కప్ గెలుపొందారు.

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై గవర్నర్‌కు ఫిర్యాదు

» ప్రకటనలపై అభ్యంతరం

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వంపై ప్రజలను రెచ్చగొట్టేలా దిన పత్రికలలో ప్రకటనలు ఇచ్చేందుకు ప్రజాధనం వృథా చేయడాన్ని అభ్యంతరం వ్యక్తం చేస్తూ గవర్నర్‌కు రాష్ట్ర ప్రభుత్వ తీరుపై బీజేపీ ఫిర్యాదు చేసింది. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ రాజీవ్, ఎమ్మెల్సీ చలవాది నారాయణస్వామి, మాజీ మంత్రి హరతాళు హాలప్ప, ప్రముఖులు భాస్కర్‌రావు, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు వివేకరెడ్డిలతో కూడిన బృందం మంగళవారం రాజ్‌భవన్‌కు వెళ్లి వినతిపత్రాన్ని సమర్పించారు. సమాఖ్య వ్యవస్థకు భంగం కలిగించేలా రాష్ట్రప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. 'మా పన్నులు మా హక్కు' పేరిట ప్రకటనల ద్వారా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీ చలో పిలుపునిచ్చారన్నారు. రాష్ట్ర ప్రజలను దారి తప్పించేలా ప్రకటనలు ఉన్నాయన్నారు. కేంద్రప్రభుత్వాన్ని ఎదిరించేలా ప్రకటనలు ఇచ్చి ఖజానా నిధులను ఇలా దుర్వినియోగం చేయడం సరికాదని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఈ అంశంపై గవర్నర్ తగిన చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



రాజ్‌భవన్ అధికారికి లేఖను అందజేస్తున్న బీజేపీ నేతలు

గుండెపోటుతో గదగ్ సైనికుడి మృతి



కరిబసనగౌడ (ఫైల్)

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): సిక్కింలో విధి నిర్వహణలో ఉన్న వేళ కర్ణాటక రాష్ట్రానికి చెందిన సైనికుడు గుండెపోటుకు గురై మంగళవారం మృతి చెందాడు. గదగ్ జిల్లా నరగుంద తాలూకా రెడ్డేర నాగనూర గ్రామానికి చెందిన రామనగౌడ కరిబసన గౌడ (44) అస్సోం- సిక్కింల మధ్య ఉన్న బాంగ్‌డోంగ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం దట్టమైన హిమపాతం ఉన్న ప్రాంతంలో విధులు నిర్వహించిన ఆయన మంగళవారం వెనుదిరుగుతుండగా ఒక్కసారిగా గుండెపోటుకు గురయ్యారు. తక్షణం ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినా ఫలితం కనిపించలేదు. సైనికుడి పార్థివదేహాన్ని బుధవారం బెంగళూరుకు తీసుకురానున్నారు. అనంతరం స్వగ్రామానికి తరలించనున్నారు. సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు. టిబెటియన్ సరిహద్దులోని 13వ బెటాలియన్‌లోనూ సిక్కిం రాష్ట్రఇండో టిబెటియన్ సరిహద్దులోనూ, ఉత్తరాఖండ్, మిజోరాం తదితర ప్రాంతాలలో 22సంవత్సరాలుగా సేవలందించిన రామనగౌడకు భార్య, ఒక కుమారుడు ఉన్నారు. కాగా రెడ్డేర నాగూర గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.

'భారత్ రైస్' విక్రయాలకు యడియూరప్ప శ్రీకారం

బెంగళూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భారత్ రైస్ విక్రయాలకు బెంగళూరు డాలర్స్ కాలనీలో మాజీ ముఖ్యమంత్రి బీఎస్ యడియూరప్ప మంగళవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. బియ్యం ధరలు పెరుగుతుండటంతో స్పందించిన ప్రధాని మోదీ మధ్యతరగతి ప్రజల కోసం కిలో 29 రూపాయాలకే అందిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నేషనల్ అగ్రికల్చరల్ కో-ఆపరేటివ్ మార్కెటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (నాఫెడ్) ద్వారా బెంగళూరు నగర వ్యాప్తంగా ఏడు సంచార వాహనాల్లో ఈ చౌకబియ్యాన్ని భారత్ రైస్ బ్రాండ్ పేరిట 10 కిలోల ప్యాక్‌లలో విక్రయిస్తారని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ఇది పూర్తిగా కేంద్ర ప్రభుత్వ పథకమన్నారు. నిజానికి చౌక డిపోల ద్వారా ప్రజలకు ఇస్తున్న ఉచిత బియ్యం పథకం కూడా కేంద్రానిదేనని అయితే అన్న భాగ్య పేరుతో రాష్ట్ర ప్రభుత్వం తనదిగా ప్రచారం చేసుకుంటోందని ఆయన ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో నాఫెడ్ రాష్ట్ర అధికారిణి జ్యోతి పాటిల్ మాట్లాడుతూ ఆన్‌లైన్‌లోనూ ఈ బియ్యాన్ని ఎవరైనా తెప్పించుకోవచ్చునన్నారు. ఈ మేరకు బిగ్‌బాస్కెట్, ఫ్లిప్‌కార్ట్, రిలయన్స్ స్టోర్స్‌తో నాఫెడ్ ఒప్పందం కుదుర్చుకుందన్నారు. కాగా నాఫెడ్ ద్వారా ఇప్పటికే కిలో గోధుమ పిండిని కిలో రూ 27-50కు, శనగ పప్పు కిలో రూ 60కు విక్రయిస్తున్నామన్నారు.

చింతామణిలో అశ్వమేధ బస్సులు



ఆర్టీసీ డిపోలో కొత్త సర్వీసులతో అధికారులు, సిబ్బంది

చింతామణి, ఫిబ్రవరి 6: రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (కేఎస్ఆర్టీసీ) అశ్వమేధ క్లాజిక్ బస్సులలో ఐదు బస్సులు పట్టణంలోని కేఎస్ఆర్టీసీ డిపోకు చేరుకున్నాయి. సోమవారం నుంచే బస్సు సర్వీసులు ప్రారంభమయ్యాయి. రాజధాని బెంగళూరు, అనేక జిల్లా కేంద్రాలకు ఈ బస్సులు నడవనున్నాయని పట్టణంలోని స్థానిక మేనేజర్ సరితా తెలిపారు. చింతామణి డిపోనుంచి బెంగళూరు గ్రామీణ జిల్లా హొసకోటె, బెంగళూరు నగర బయ్యప్పనహళ్ళి మెట్రో రైల్వే స్టేషన్, స్థానిక మార్గాలలో ఈ బస్సులు సంచరిస్తాయన్నారు. నాన్ ఏసీ సౌకర్యాలు ఉన్న ఈ బస్సులలో 12 ప్యానిక్ బటన్‌లతోపాటు జీపీఎస్, రెండే రేర్ కెమెరా వ్యవస్థ ఉన్నాయన్నారు. మొబైల్ ఫోన్ చార్జింగ్‌కోసం 6 పాయింట్‌లు, 52 బకెట్ సీట్ల వ్యవస్థ ఉన్నాయన్నారు. ప్రతి సీటు వెనుక మ్యాగజైన్, వాటర్ బాటిల్ పౌచ్ సౌలభ్యం, లగేజ్ పెట్టుకునే అవకాశం ఉందన్నారు. అశ్వమేధ సర్వీసులపై ప్రయాణీకులు హర్షం వ్యక్తం చేశారు.

ట్రూ కాలర్‌తో కర్ణాటక ప్రభుత్వం కీలక ఒప్పందం

బెంగళూరు, ఫిబ్రవరి 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎలక్ట్రానిక్స్, ఇన్‌ఫర్మేషన్ శాఖ డిజిటల్ సాంకేతికత రక్షణ కోసం ట్రూకాలర్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం దరిమిలా సైబర్ నేరాలకు బ్రేక్ వేసేందుకు అవసరమైన కార్యాచరణను రూపొందించుకోనున్నట్టు ఐటీబీటీ శాఖ మంత్రి ప్రియాంక ఖర్గే బెంగళూరులో మంగళవారం మీడియాకు తెలిపారు. సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజల్లో అవగాహన కల్పించే దిశలో ఉభయసంస్థలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దేశ ఐటీబీటీ రాజధానిగా ఉన్న బెంగళూరు నగరంలో ఇటీవలికాలంలో సైబర్ నేరాలు బాగా పెరుగుతున్న నేపథ్యంలో స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ముందు జాగ్రత్తగా ఈ సాంకేతికతను గరిష్ఠంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ట్రూకాలర్ మేనేజింగ్ డైరెక్టర్ రిషిట్ జున్‌జున్ వాలా మీడియాకు తెలిపారు. ఢిల్లీ, అస్సోం లలో కూడా సైబర్ నేరాలకు అడ్డుకట్ట వేసే దిశలో ట్రూకాలర్ సాంకేతికత బాగా దోహదపడిందని చెప్పారు.



ఒప్పందంలో మంత్రి ప్రియాంక ఖర్గే తదితరులు

కేశ విన్యాస రంగానికి పెరుగుతున్న ఆదరణ



సంస్థ లోగో ఆవిష్కరణలో ప్రముఖులు

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): దేశంలో కేశ విన్యాసం, మేకప్ రంగాలకు ఆదరణ గణనీయంగా పెరుగుతోందని ఇందులో యువతకు ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని జూప్స్ అకాడమీ వెల్లడించింది. సంస్థాపకుడు రాజు ఆధ్వర్యంలో ఏర్పాటైన అకాడమీ లోగో ఆవిష్కరణ మంగళవారం నగరంలో జరిగింది. ఈ సందర్భంగా కార్యక్రమాన్ని ఉద్దేశించి జూప్స్ అంబాసిడర్, సినీ నటి జ్యోతి ప్రసంగిస్తూ జీఎస్టీ చెల్లింపులో కేశ విన్యాసం, మేకప్ రంగం 4వస్థానంలో ఉందన్నారు. దేశ ఆర్థిక ప్రగతిలో సెలూన్ నిర్వాహకులు, కాస్మెటిక్స్ విక్రేతలు గణనీయ పాత్ర పోషిస్తున్నారన్నారు. కేశ విన్యాస రంగంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి సొంతంగా విభాగాలు ఏర్పాటు చేసుకునే ఆసక్తి కల్గిన నిపుణులైన 20మందికి తలా రూ.5లక్షల సాయం అందించనున్నట్టు జూప్స్ అకాడమీ నిర్వాహకుడు రాజా ప్రకటించారు. కార్యక్రమంలో లింగరాజు బళ్ళారి, బైలప్ప నారాయణస్వామి, జీఆర్ కౌశిక్, కమ్మనహళ్ళి కృష్ణమూర్తి, మహేంద్రప్రసాద్, సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఇదే సందర్భంగా ప్రత్యేక శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. దేశ విదేశాలనుంచి వచ్చిన నిపుణులు పాల్గొన్నారు.

కష్టపడితే విజయం తథ్యం

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): ఏ రంగంలోనైనా ఒకింత శ్రద్ధ వహించి అంకితభావంతో కష్టపడితే విజయం తథ్యమని ప్రముఖ పారిశ్రామికవేత్త అమిత్‌నాగ్ పేర్కొన్నారు. నగరంలో వాణిజ్య రంగంలో విజయాలు అనే అంశంపై మంగళవారం ఏర్పాటైన సదస్సును ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. భారతీయ వాణిజ్యరంగంలో మాస్టర్‌మైండ్‌గా పిలవబడే అమిత్‌నాగ్ తన ఎఫ్ఈఎస్‌టీ బిజినెస్ కోర్సు ద్వారా దేశవ్యాప్తంగా పది నెలల్లో 5వేలమందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణకు అనూహ్యస్పందన లభిస్తున్న నేపథ్యంలో పలు సంస్థలు ఆయనతో ముఖాముఖి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకోసం ఏర్పాటైన సమావేశంలో దేశం నలు మూలలనుంచి పెద్దసంఖ్యలో ప్రతినిధులు హాజరయ్యారు. ఏరోస్పేస్, ప్లాస్టిక్ తయారీ, సెక్యూరిటీ కెమెరాలు ఇత్యాది అంశాలకు సంబంధించి బ్లాక్‌బుక్ ఎడిషన్‌ను ఆయన ప్రారంభించారు. కేవలం 30మంది ఔత్సాహిక పారిశ్రామిక వేత్తల బృందం తాను ఇచ్చిన వాణిజ్య కిటుకులతో 150 కోట్ల టర్నోవర్ సాధించారని, ఇంకొంచెం కష్టపడి ఉంటే ఇది రూ.200 కోట్లు దాటేదని ఆయన ఈ సమావేశంలో తెలిపారు. దేశంలోని అనేక ప్రముఖ కంపెనీలకు కూడా తాను సలహాదారుడిగా వ్యవహరిస్తున్నానని అమిత్ వెల్లడించారు.



సదస్సులో పాల్గొన్న యువ పారిశ్రామికవేత్తల బృందం

వెంకటాపుర పాల సహకార సంఘం అధ్యక్షుడిగా మంజునాథ్

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 6: తాలూకాలోని జై వెంకటాపుర పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా జేడీఎస్ మద్దతుదారులైన జేఆర్ మంజునాథ్, ఎం శివకుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులతోపాటు నూతన డైరెక్టర్‌లను హేమంత్‌కుమార్, మునిరాజు, బీరేగౌడ, వెంకటేశ్, మునికృష్ణప్ప, సుశీలమ్మ, భాగ్యమ్మ, వెంకటేశప్పలను ఎమ్మెల్యే రవికుమార్ ప్రత్యేకంగా అభినందించారు. పాల సహకార సంఘాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని మంజునాథ్ తెలిపారు. ఈ సందర్భంగా జేడీఎస్ నాయకులు పద్మలాభగౌడ, మునియప్ప, శ్రీనివాస్, మున్నారణప్ప, ప్రభాకర్, జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన డైరెక్టర్లతో సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులు

జేడీఎస్ రాష్ట్ర కోశాధికారిగా ఎమ్మెల్యే రవికుమార్



ఎమ్మెల్యే రవికుమార్

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 6: శిడ్లఘట్ట నియోజకవర్గ ఎమ్మెల్యే బీఎన్ రవి కుమార్‌కు జేడీఎస్ పార్టీ రాష్ట్ర కోశాధికారిగా నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ సీఎం కుమార స్వామి ఆదేశాలు జారీ చేశారు. జేడీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శులుగా పలువురు ఎమ్మెల్యేలు, ప్రముఖులకు అవకాశం కల్పించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే రవి కుమార్‌కు పార్టీ కోశాధికారి హోదా ఇచ్చారు. నియోజకవర్గంలో ఎన్నో ఏళ్లుగా సమాజసేవ అందిస్తున్న రవికుమార్ ఇదే తొలిసారిగా ఎమ్మెల్యే అయ్యారు. పార్టీని బలోపేతం చేసేలా మరింత అవకాశం కల్పించడంపై అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

11న ఉచిత గుండె వైద్య శిబిరం

హిందూపురం అర్బన్, ఫిబ్రవరి 6: యూటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం హిందూపురం జోన్ ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు యూటీఎఫ్ నాయకులు తెలిపారు. ఆత్మీయ ట్రస్ట్ ధర్మవరం వారి సహకారంతో ఈ శిబిరం అందిస్తున్నట్లు వారు తెలిపారు. గుండె నొప్పి, గుండెదడ, ఆయాసం, కళ్లు తిరగడం, చాతీలో మంట తదితర లక్షణాలు , వ్యాధులు కలవారు సంప్రదించాలన్నారు. 11న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు స్థానిక అల్‌హిలాల్ పాఠశాలలో శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిరు. ఈ సం దర్భంగా మంగళవారం నూతన మునిసిపల్ కమిషనర్ శ్రీకాంత్ చేతుల మీదుగా సంబంధిత కరపత్రాలు విడుదల చేశారు.

నీట మునిగి యువకుడి మృతి



సుబ్రమణి (ఫైల్)

బంగారపేట, ఫిబ్రవరి 6: చెరువులో ఈతకు వెళ్లిన ఒక వ్యక్తి నీట మునిగి మృతి చెందిన సంఘటన పట్టన సమీపంలోని దేశిహళ్ళి గ్రామంలో చోటు చేసుకుంది. దేశిహళ్ళి గ్రామానికి చెందిన సుబ్రమణి (35) గా గుర్తించారు. సోమవారం సాయంత్రం 5.30 గంటలకు చెరువు గట్టున బట్టలు ఉంచి ఈతకు వెళ్లాడు. ఒక వైపు నుంచి మరోవైపు చేరేందుకు ప్రయత్నిస్తూ ఆయాసంతో నీట మునిగాడు. మరో వైపు అతడి సోదరుడు చేపలు పడుతున్నాడు. ఎంతసేపటికీ రాలేదని గమనించగా చెరువు మధ్యలో సుబ్రమణి ఉన్నట్టు గుర్తించి వాపసు రావాలని సూచించాడు. అయినా ముందుకు వెళ్తానంటూ ఆయాసపడి చివరకు నీటిపాలయ్యాడు. చెరువు సుమారు 60 అడుగుల లోతు మేర ఉన్నట్టు తెలుస్తోంది. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. సబ్ ఇన్‌స్పెక్టర్ రాజణ్ణ నేతృత్వంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది కూడా వచ్చారు. అప్పటికే చీకటి పడ్డంతో గాలింపు సాధ్యం కాలేదు. కేజీఎఫ్ జిల్లా ఎస్పీ శాంతరాజ్ దృష్టికి సమస్యను తేవడంతో లైట్ల వెలుగులో కార్యాచరణ చేపట్టారు. పాతాళభేరి కూడా ఉపయోగించారు. అయితే ప్రయోజనం లేకపోయింది. చివరకు మంగళవారం ఉదయం మృతదేహాన్ని వెలికి తీశారు. బంగారపేట పోలీసులు కేసు నమోదు చేసుకుని తదుపరి దర్యాప్తు చేపట్టారు.

సైబర్ స్టేషన్లలో సిబ్బంది కొరత

బెంగళూరు మెట్రో, ఫిబ్రవరి 6: నగర పరిధిలోని 8 విభాగాలలో ప్రతి సంవత్సరం సైబర్ నేరాలు పెరుగుతున్నప్పటికీ వాటి దర్యాప్తు, కేసుల పరిష్కారానికి అవసరమైన సిబ్బంది కొరత ఉందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. గడిచిన మూడేళ్లలో 33,985 కేసులు నమోదైనట్టు పోలీసు అధికారులు వెల్లడించారు. నమోదైన కేసుల దర్యాప్తుకు 60శాతం కొరత ఉండడంతోపాటు అత్యాధునిక సాంకేతిక సామగ్రి అందుబాటులో లేదన్నారు. పదేళ్లక్రితం నాటి సామగ్రితోనే కేసుల దర్యాప్తు సాగించాల్సి వస్తోందన్నారు. ప్రస్తుతం నగదు లావాదేవీలు ఆన్‌లైన్‌లో జరుగుతుండడంతో ఆన్‌లైన్ మోసాలకు పాల్పడేవారి సంఖ్య పెరుగుతోందన్నారు. అయితే దర్యాప్తు నత్త నడకన సాగుతోందని గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ కారణంగా మూడు సంవత్సరాలలో 16వేలకు పైగా కేసులు పరిష్కారానికి నోచుకోవడం లేదని తెలుస్తోంది. ఇంతవరకు అందిన గణాంకాల మేరకు బెంగళూరు సెంట్రల్ 1126, పడమర 1941, ఉత్తర 3260, దక్షిణ 2094, ఈశాన్య 1994, దక్షిణ ఈశాన్య 1917, దక్షిణ తూర్పు 2674, వైట్‌ఫీల్డ్ 2562 కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది.

బీజేపీ కంచుకోట తుమకూరును వదులుకోవద్దు

» మాజీ మంత్రి జేసీ మాధుస్వామి

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ-జేడీఎస్‌ల మధ్య పొత్తు దరిమిలా తుమకూరు లోక్‌సభా నియోజకవర్గంపై సందిగ్ధత కొనసాగుతోంది. ఈ నియోజకవర్గం బీజేపీ కంచుకోటల్లో ఒకటని ఎట్టి స్థితిలోనూ వదులుకోవద్దని జిల్లాకు చెందిన మాజీ మంత్రి జేసీ మాధుస్వామి అభిప్రాయపడ్డారు. తుమకూరులో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. బయటి నుంచి వచ్చిన నేతలు తుమకూరులో గెలిచిన దాఖలాలు లేవన్నారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఈ నియోజకవర్గం నుండి పోటీచేసిన మాజీ ప్రధాని దేవెగౌడ, మాజీ పోలీస్ బాస్ కోదండరామయ్య ఓటమిపాలైన సంగతిని ఆయన గుర్తుచేశారు. తుమకూరు నియోజకవర్గ నుండి బీజేపీ అభ్యర్థి బరిలోకి దిగితే భారీ మెజార్టీతో విజయం తథ్యమన్నారు. తాను కూడా రేస్‌లో ఉన్నానని అందుకు తగిన అన్ని అర్హతలు తనకు ఉన్నాయని అయితే అధిష్ఠానానిదే తుది నిర్ణయమని ఆయన తేల్చిచెప్పారు. పొత్తు దరిమిలా తుమకూరును జేడీఎస్‌కు కేటాయించబోతున్నట్లు కథనాలు వినిపిస్తున్న నేపథ్యంలో మాధుస్వామి చేసిన ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది.

మంత్రాలయం స్వామిజీతో వినయ్ గురూజీ భేటీ

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): మంత్రాలయం రాఘవేంద్ర స్వామి మఠాధిపతి సుబుదేంద్రతీర్థ స్వామిజీని బెంగళూరు జయనగర్‌లోని నంజనగూడు మఠంలో అవధూత వినయ్ గురూజీ మంగళవారం భేటీ అయ్యారు. స్వామిజీ ఆశీస్సులను పొందారు. ఎమ్మెల్సీ శరవణతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. అంతకుముందు రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రస్వామిని దర్శించుకుని హారతి పొందారు.



స్వామిజీతో వినయ్ గురూజీ, ఎమ్మెల్సీ శరవణ

సీవీ శ్రీనివాసయ్యకు ఘన నివాళి



గానలహరిలో కళాకారులు

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): బెంగళూరు నగరానికి చెందిన ప్రవాసాంధ్ర ప్రముఖుడు సీవీ శ్రీనివాసయ్య 6వ వర్ధంతి సందర్భంగా ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. జగ్జీవన్‌రాంనగర్‌లోని వీఎస్ గార్డెన్‌లో ఈ సందర్భంగా ఘంటసాల గానలహరిని నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు సీవీ శ్రీనివాసయ్యను స్మరించుకున్నారు. తుదిశ్వాస వరకు ఆయన తెలుగు భాషా సంస్కృతులకోసం ఎనలేని సేవలందించారని సమాజసేవలో సదా ముందుండేవారని తెలుగు విజ్ఞాన సమితి కార్యవర్గ సభ్యులు కేఎస్ నరసింహమూర్తి పేర్కొన్నారు. ప్రత్యేకించి కళాకారుల్ని ఆయన వెన్నతట్టి ప్రోత్సహించేవారన్నారు. గాయకులైన జూనియర్ ఘంటశాలగా పేరుగాంచిన నవీన్ ఆలపించిన పలు పాత తెలుగు సినీగీతాలు ప్రేక్షకుల్ని విశేషంగా అలరించాయి. ప్రశాంత్, కెఎస్.వెంకటేశులు తమ మధురగానంతో అందర్నీ మెప్పించారు. ఈ కార్యక్రమానికి సీవీ శ్రీనివాసయ్య అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన ఆప్

బెంగళూరు, ఫిబ్రవరి 6 (ఆంధ్రజ్యోతి): చండీఘడ్ మేయర్ ఎన్నిక సమయంలో ప్రజాస్వామ్యాన్ని పాతర పెట్టినట్టు సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యాలు బీజేపీకి చెంప పెట్టులాంటివని ఆమ్ ఆద్మీ పార్టీ కర్ణాటక అధ్యక్షుడు ముఖ్యమంత్రి చంద్రు అభివర్ణించారు. కేంద్రంలోని బీజేపీ ప్రజాస్వామ్యాన్ని పరిహాసం చేసేలా వ్యవహరిస్తోందని, ఎన్నికైన ప్రజా ప్రభుత్వాలను అడ్డగోలున కూలదోయడమే లక్ష్యంగా పెట్టుకుందని ఆరోపించారు. దేశంలోనూ ఏ రాష్ట్రంలోనూ బీజేపీ తప్ప మరెవ్వరు అధికారంలో ఉండరాదన్న దర్బుద్ధి కనిపిస్తోందన్నారు. సుప్రీంకోర్టు నేపథ్యంలో చండీఘడ్ మేయర్ తక్షణం రాజీనామా చేయాలని సుప్రీంకోర్టు పర్యవేక్షణలోనే తాజాగా మేయర్ ఎన్నిక జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈమేరకు బెంగళూరులో మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో క్యాన్సర్‌పై జాతా



జాతాలో పాల్గొన్న వైద్యులు, అధికారులు

శిడ్లఘట్ట, ఫిబ్రవరి 6: శిడ్లఘట్ట పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ప్రత్యేక జాతా నిర్వహించారు. తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ వెంకటేశ్ మూర్తి, ఆసుపత్రి పాలనా వైద్యాధికారి డాక్టర్ మనోహర్, మహిత ట్రస్టు పదాధికారులు స్వరూప, కవితా, వైద్యులు స్వాతి, డాక్టర్ మహదేవ, ఆయుష్ డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు. కేన్సర్‌ను ఆరంభంలోనే గుర్తిస్తే చికిత్స సులభతరమని, జీవనశైలిలో కూడా తగిన మార్పులు చేసుకోవడం ద్వారా అధిగమించవచ్చునని పలువురు అభిప్రాయపడ్డారు. ఆరోగ్యకేంద్రం వైద్యులు భరత్, తాలూకా ఆరోగ్య అధికారి దేవరాజ్, మునిరత్నమ్మ, తాలూకా ఆశా అధికారి గీతా, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

బలమందె వ్యవసాయ సేవా సహకార సంఘం అధ్యక్షుడిగా జీవీ వెంకటేశ్

బంగారపేట, ఫిబ్రవరి 6: తాలూకాలోని బలమందె వ్యవసాయ సేవా సహకార సంఘానికి కాంగ్రెస్‌కు చెందిన జీవీ వెంకటేశ్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు సోమవారం ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, ఉపాధ్యక్షస్థానాలకు వెంకటేశ్, కనమనహళ్ళి మంజునాథ్‌లు మాత్రమే నామినేషన్ వేయడంతో ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి బాలకృష్ణ ప్రకటించారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులను, డైరెక్టర్‌లను ఆత్మీయంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు వెంకటేశ్ మాట్లాడుతూ తనకు రెండోసారి సంఘం అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన డైరెక్టర్‌లు, నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.